

ఫార్మా ఫ్యాక్టరీపై వ్యతిరేకత 2



క్రికెట్ టోర్నీ ప్రారంభం 2

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

## కల్లడికి బస్సు సౌకర్యం కల్పించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండలం కల్లడి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇస్సపల్లి రాజు వార్డు సభ్యులు కిషన్, గంగూలి, వంశీ, మహేష్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.



## సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



**అక్షరటుడే, ఇందూరు:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం నిజామాబాద్ రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ఎం జ్యోత్స్న తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల తొమ్మిదవ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి వరకు, అలాగే తిరుగు ప్రయాణంలో కూడా అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్-1 డిపో నుంచి 96, నిజామాబాద్-2 డిపో నుంచి 53, ఆర్మూర్‌లో 94, బోధన్‌లో 86, బాన్సువాడలో 74, కామారెడ్డి నుంచి 94, మొత్తం 500 బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### బాన్సువాడ డిపోను తనిఖీ చేసిన ఆర్ఎం

**బాన్సువాడ:** బాన్సువాడ ఆర్టీసీ డిపోను రీజినల్ మేనేజర్ జ్యోత్స్న బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపో సిబ్బందితో సమావేశమయ్యారు. డిపోను నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకురావాలని సూచించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆమె కోరారు. డిపో ఆవరణలో పూల మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రవికుమార్, కిష్టయ్య, బసంత్, మంజుల, రాజారాం పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి




**అక్షరటుడే, ఇందూరు :** గ్రామాల్లో,, పట్టణాల్లో మూడు రోజులపాటు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా బాట' నిర్వహించాలని వరంగల్ ఆపరేషన్స్ సీఈ అశోక్ ఆదేశించారు. నగరంలోని పవర్ హౌస్‌లోని గోల్డెన్ జూబ్లి హాల్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో, పట్టణాల్లో వారానికి మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో ఏఈ స్థాయి అధికారులు తమ సిబ్బందితో కలిసి ప్రజాబాట నిర్వహించాలని సీఈ సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్ డ్యామేజ్, అలాగే లూజ్ కనెక్షన్లు, చెట్లకొమ్మలు తొలగించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్లు పూర్తి చేయాలని, డీటీఆర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించాలని ఆయన సిబ్బందికి సూచించారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ ఉండాలన్నారు. సమావేశంలో డీఈ టెక్నికల్ రమేష్, ఎస్ఏవో శ్రీనివాస్ డీఈలు ఎం.శ్రీనివాస్, ఎండీ ముక్తార్, ఎండీ ముక్తార్ రఘు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## సమాజాన్ని ఉన్నతీకరించడంలో విద్యదే కీలకపాత్ర




**అక్షరటుడే, ఇందూరు:** సమాజాన్ని ఉన్నతీకరించడంలో విద్యదే కీలక పాత్ర అని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఈపీ ఆధారంగా విద్యలో గుణాత్మక మార్పుల కోసమే డిగ్రీ, పీజీ పాఠ్య ప్రణాళికల మార్పులు చేపడుతున్నామన్నారు. రీసెర్చ్ అవార్డ్స్ లెర్నింగ్ మెటీరియల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ తదితర అంశాలను రూపొందించి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని ఛైర్మన్ తెలిపారు. అధ్యాపకులు మరింత కృషిచేసి విద్యార్థులకు ఉత్తమమైన బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగరత్నం, పీఆర్వో దండు స్వామి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ రామస్వామి, అధ్యాపకులు రంజిత, వినయ్, ముత్తెన్న, చంద్రశేఖర్, రామకృష్ణ, జయ ప్రసాద్, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

**మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో రాజకీయ పార్టీల్లో కోలాహలం మొదలైంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ జాబితా విడుదల చేసింది. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే పోటీ చేసే వార్డు రిజర్వేషన్ గతంలో ఉన్నదే ఉంటుందా.. మారుతుందా అనే విషయంలో అభ్యర్థులు తర్జనబర్జన పడుతున్నారు.** – అక్షరటుడే, ఇందూరు




# ఆశావహుల్లో అయోమయం

- మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పుపై పుకార్లు
- ఆందోళనలో అభ్యర్థులు
- సమాచారం లేదంటున్న అధికారులు

నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, మున్సిపాలిటీలతో పాటు నిజామాబాద్ నగరపాలక సంస్థకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు కమిషనర్ దిలీప్ కుమార్ సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. దీంతో ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంది. ఆయా పార్టీల అభ్యర్థుల సైతం తమ సీటును ఖరారు చేసుకునేందుకు నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే పాలకవర్గం ముగిసి సుమారు ఏడాది కావస్తుంది. దీంతో అప్పటి నుంచి మాజీలు ప్రజాప్రతినిధులు నాయకుల వెంట ఉంటూ తమ స్థానాన్ని పదిలం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

### రిజర్వేషన్లపై ఆశలు..

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. ఇటీవల నిజామాబాద్‌లోని డివిజన్లతో పాటు ఆయా మున్సిపాలిటీ వార్డుల్లో రిజర్వేషన్లు మారుతాయని పుకార్లు మొదలయ్యాయి. దీంతో పోటీకి సిద్ధమైన అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. తమకు బలమున్న వార్డుల్లో అనుకూలంగా రిజర్వేషన్ వస్తుందో లేదోనన్న సందేహం నెలకొంది. ఆయా పార్టీలో ఇప్పటికే రిజర్వేషన్లపై చర్చ కొనసాగుతోంది. కొత్త వారితోపాటు పాత అభ్యర్థులు సైతం వార్డుల వారీగా రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

### నగరపాలక సంస్థలో పోటీ తీవ్రం

నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లు ఉన్నాయి. అయితే ఎన్నికలపై అన్ని పార్టీల్లోనూ పోటీ తీవ్రంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రధానంగా బీజేపీకి ఆశావాహులు ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో ఏకంగా 28 సీట్లను బీజేపీ కైవసం చేసుకుంది. అలాగే ఇటీవల ఇతర పార్టీలకు చెందిన నాయకులు సైతం ఆ పార్టీలో చేరారు. అలాగే ఎంఐఎం పార్టీలోను తీవ్రమైన పోటీ ఉంది. గత ఎన్నికల్లో 15 డివిజన్లో గెలుపొందింది. మైనార్టీ డివిజన్లను ఏకపక్షంగా విజయం సాధించింది. ఇక అధికార కాంగ్రెస్‌లోనూ గతంతో పోలిస్తే ఈసారి ఆశావాహులు ఎక్కువగానే కనబడుతున్నారు. అధికారంలో ఉండటంతో గెలుపు ఖాయమనే ధీమాతో అభ్యర్థులు ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో సైతం పలువురు అభ్యర్థులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారు అయితే టికెట్ల లెక్క తేలనుంది.

> ### రిజర్వేషన్లపై సమాచారం లేదు
>
> రిజర్వేషన్లపై మాకు ఎలాంటి సమాచారం లేదు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుంది. ప్రస్తుతానికైతే ముసాయిదా ఓటరు జాబితా సవరించే పనిలో ఉన్నాం. జాబితాలో ఏదైనా సందేహాలు ఉంటే అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం. ఈనెల 10వ తేదీలోపు తుది ఓటరు జాబితా విడుదల చేస్తాం.
>
> – దిలీప్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్

## అట్టహాసంగా ప్రారంభమైన సైన్స్‌ఫేర్





**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరవుతారని భావించినా అనివార్య కారణాలతో రాలేకపోయినట్టు సమాచారం. దాంతో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.


### రాష్ట్ర నలుమూలల నుంచి..

సైన్స్‌ఫేర్ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ పాఠశాలలకు సంబంధించిన 1,700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ ఫేర్‌లో 880 ప్రాజెక్ట్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను షబ్బీర్ అలీ తిలకించారు. ప్రదర్శనలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన ఆవిష్కరణలు జరగాలన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు.

### కాంగ్రెస్ వచ్చాకే..

తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మిడ్ డే మిల్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200శాతం పెంచిందని షబ్బీర్ అలీ తెలిపారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ.. విద్యావ్యవస్థ బలపడాలంటే నూతన ఒరవడి అయిన ఏఐ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాటిలైట్ టెక్నాలజీ హైడ్రోజన్ ఎనర్జీ వంటి నూతన విధానాలకు ప్రేరణ కల్పించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అప్పుడే నూతన భారతం నిర్మితమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సృజనాత్మకత ప్రతి ఒక్క విద్యార్థుల్లోనూ ఉంటుందని దానిని వెలికితీసి సరైన మార్గంలో వారికి మార్గనిర్దేశం చేయడమే సైన్స్ ఉపాధ్యాయుల కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ రమేష్, ఆర్జేడీ సత్యనారాయణ, డీఈవో రాజు పాల్గొన్నారు.

## కేజీబీవీని తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్



**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా ఉర్దూ మీడియం పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా వంట సామగ్రిని, కిరాణా వస్తువులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సబ్ కలెక్టర్ మాట్లాడారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనాన్ని అందించాలని.. విద్యాప్రమాణాలను పెంచాలని సూచించారు.

## ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగరేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాబోయే ఎన్నికల్లో ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగరేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ సూచించారు. ఈ మేరకు బుధవారం మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలతో పట్టణంలో సమావేశమయ్యారు. రిజర్వేషన్ల అనంతరం అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీ నిర్దేశించిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు తానాజీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో క్రమశిక్షణ



**అక్షరటుడే, బాన్సువాడ:** క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం క్రీడా, వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, నోడల్ అధికారి సలాం, పిట్ల శ్రీధర్, ఎజాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



**అక్షరటుడే, బోధన్ :** రోడ్డు భద్రత నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని డీటీవో ఉమామహేశ్వర్ రావు సూచించారు. రోడ్డు భద్రత ఉత్సవాల్లో భాగంగా బుధవారం నవీపేట్ స్కాలర్స్ హైస్కూల్ , లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లలో విద్యార్థులకు ఆర్టీఏ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ.. విద్యార్థులు అవగాహన కార్యక్రమాల్లో తెలుసుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. రోడ్డు భద్రత పాటించకుండా వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగితే కుటుంబాల్లో విషాదం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా నవీపేట్ స్కాలర్స్ హైస్కూల్‌లో 1300 మంది విద్యార్థులు, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. అలాగే రెండు పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు ర్యాలీలో పాల్గొనగా నవీపేట్ జంక్షన్ వద్ద అధికారులు ప్రజలు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎంవీఐ కిరణ్ కుమార్, ఏఎంవీఐలు పవన్ కళ్యాణ్, వాసుకి, శృతి, సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్, ఎంఈవో అశోక్, వర్ష ఈడీఏఆర్, రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీనివాస్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రెయిలీ లిపి కాదు.. అంధుల ఆశాజ్యోతి : సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** బ్రెయిలీ లిపి కాదని.. అంధుల ఆశాజ్యోతి అని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంధుల వనరుల కేంద్రంలో బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ అంధుల అభ్యున్నతికి అంధత్వమనేది అడ్డు కాదని అన్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అని పెద్దలు చెప్పారన్నారు. కళ్లు లేకున్నప్పటికీ ప్రపంచాన్ని చూసేందుకు లూయిస్ బ్రెయిలీ లిపిని కనిపెట్టారని సీపీ చెప్పారు. అంధులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. అనంతరం సీపీ అంధ విద్యార్థులకు కేక్ తినిపించారు. నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అంధ విద్యార్థిని రజిని స్నేహ సొసైటీ పాఠశాలకు రూ.50వేల విలువైన బెంచీలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, స్నేహ సొసైటీ అంధుల పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, పాఠశాల డైరెక్టర్ సిద్ధయ్య, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, అర్బన్ సీడీపీవో సౌందర్య పాల్గొన్నారు.

## సైబర్ క్రైం జరిగితే గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయాలి




**అక్షరటుడే, ఇందూరు:** సైబర్ క్రైం జరిగిందని గుర్తిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం ఎస్పీ సాయిశ్రీ తెలిపారు. కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో బుధవారం సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే మొదటి గంటను గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారన్నారు. ఆ గంటలోపు 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే డబ్బులను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా డేటింగ్ యాప్ మోసాలు, సైబర్ బుల్లియింగ్, సైబర్ స్టాకింగ్, మాట్రిమోనియల్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలు, పిల్లలపై కూడా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, వాటిని గుర్తిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ బస్వారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఏసీపీ రాజా వెంకటరెడ్డి, కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజినీకాంత్, సీసీఎస్ సిబ్బంది, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫార్మా ఫ్యాక్టరీపై వ్యతిరేకత



భిక్కనూరులో ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేతులెత్తిన ప్రజలు



భిక్కనూరులో మూసి ఉన్న దుకాణాలు

**అక్షరటుడే, కామారెడ్డి :** భిక్కనూరు మండల కేంద్రంలో ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఉపాధి దొరుకుతుందేమో కానీ తమ ప్రాణాలు గాలిలో కలుస్తాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఫ్యాక్టరీ ఏర్పాటుకు పూర్తిగా వ్యతిరేకమని నినదించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు.

**ఫ్యూషన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో..**

మండల కేంద్రంలో 667 సర్వే నంబరులో 9.26 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూషన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని 18 గ్రామాల ప్రజలతో కంపెనీ ఏర్పాటు చేసే స్థలంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విక్టర్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సుమారు వెయ్యి మంది హాజరయ్యారు. కంపెనీ ఏర్పాటుతో వాయు కాలుష్యం, నీటి కాలుష్యం ఏర్పడుతుందని ప్రజలు పేర్కొన్నారు. కంపెనీ ఏర్పాటుతో అనారోగ్యానికి గురవుతామని తెలిపారు.

**ఇప్పటికే ఒక ఫ్యాక్టరీతో ఇబ్బంది..**

ఉపాధి కోసం చూస్తే ప్రాణాలు పోతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఎంఎస్ కంపెనీతో వేగలేకపోతున్నామని వివరించారు. ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాలని 100 రోజులు నిరాహార దీక్ష చేపట్టినా అధికారుల్లో చలనం లేదని ఆరోపించారు. చెరువులు, కుంటలు కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలతో నీళ్లు కలుషితం అవుతున్నాయన్నారు. ఇప్పటికే అనేక మంది అనారోగ్య బారిన పడ్డారని, మరోసారి ప్రాణాల మీదకు తెచ్చుకోలేమని స్పష్టం చేశారు. 18 గ్రామాల ప్రజలందరూ ముక్తకంఠంతో ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారని ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. తప్పుడు నివేదికలు పంపి అనుమతులు ఇచ్చి ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఉద్యమం మొదలు పెడతామని హెచ్చరించారు. ప్రభుత్వానికి అందజేసే నివేదికను తమకు కూడా 35 నుంచి 45 రోజుల్లో ఇవ్వాలని కోరారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు తామంతా వ్యతిరేకమని చేతులెత్తి తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

**అభిప్రాయ సేకరణలో గందరగోళం**

ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న సమయంలో ఓ యువకుడు తన అభిప్రాయాన్ని తెలియజేస్తుండగా జనాల్లో ఓ వ్యక్తిని చూసి ఇతను వేరే ప్రాంతం నుంచి వచ్చాడని పేర్కొనడంతో గందరగోళం నెలకొంది. దాంతో యువకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు చేరుకుని అతని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాసేపటి తర్వాత అతడిని పోలీసులు అక్కడినుంచి బయటకు పంపించేశారు. అభిప్రాయ సేకరణకు ఇతరులు వచ్చి ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఒకే అన్నట్టుగా దొంగ సంతకాలు చేస్తున్నట్టుగా అనుమానం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, ఎస్సైలతో బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

**భిక్కనూరు బంద్ ప్రశాంతం**

ఫార్మా కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం భిక్కనూరు బంద్ చేపట్టారు. బంద్ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు భిక్కనూరు పట్టణంలోని దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలిపారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అక్కడక్కడ పోలీసులను మోహరించారు.

**ప్రభుత్వానికి నివేదిస్తాం**


ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిందని అడిషనల్ కలెక్టర్ విక్టర్ తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పాటును 18 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నట్టుగా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. ప్రజల అభిప్రాయాలను వీడియో రికార్డు చేశామన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** వాహనాలు నడిపేటప్పుడు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్మూర్ ఎంవీఐ రాహుల్ కుమార్, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా పోలీస్ శాఖ, ఎంవీఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలోని రామ్ మందిర్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత, మైనర్ డ్రైవింగ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రఘుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంకాపూర్‌లో నూతన సర్పంచ్‌కు సన్మానం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం అంకాపూర్ నూతన సర్పంచ్ దేవేందర్, ఉప సర్పంచ్ తుకారామ్‌లను వాల్మీకి బోయ కుల సంఘ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవేందర్ మాట్లాడుతూ.. తనకు ఘనమైన మెజారిటీ అందించిన వాల్మీకి కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి సంఘానికి కావాల్సిన సకల సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం అధ్యక్షుడు రాసూరి శ్యాం, కార్యదర్శి ఎండపల్లి రవీందర్, సభ్యులు వై. శ్రీనివాస్, రాసూరి శేఖర్, మొకిరాల నరసయ్య, హరి, శ్రీకాంత్, బొమ్మెన నరసయ్య , మహేష్, రణవీర్, అరుణ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ప్రమాదాలకు కారణమవుతున్న చైనా మాంజాపై నిషేధం ఉందని.. ఎవరైనా ఈ మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాని ఎస్సై జి. అనిల్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పలు దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. గాలిపటాలు ఎగురవేసేందుకు సాధారణ మాంజాలనే వినియోగించాలని ఎస్సై సూచించారు. చైనా మాంజాల కారణంగా మనుషులతో పాటు పక్షులకు కూడా అపాయం పొంచి ఉందని ఆయన తెలియజేశారు. దీంతో ప్రభుత్వం గతంలోనే చైనామాంజాపై నిషేధం విధించిందని పేర్కొన్నారు. ఈ మేరకు చైనా మాంజా ఎవరి విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గిరిరాజ్ విద్యార్థుల క్షేత్ర పర్యటన




**అక్షరటుడే, ఇందూరు:** గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు క్షేత్ర పర్యటన నిర్వహించారు. బైపాస్ రోడ్‌లో ఉన్న ఐటీ టవర్‌కు తీసుకెళ్లారు. ఇంటర్వ్యూ మెలకువలు సాఫ్ట్‌వేర్ కంపెనీల పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ సమన్వయకర్త డాక్టర్ పి.రామకృష్ణ, శ్రీకాంత్, విజయ, పద్మ, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని శెట్‌పల్లి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సహకరించాలని సర్పంచ్ అట్టెం శ్రీను కోరారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, పాలకవర్గం సభ్యులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఉపసర్పంచ్ బాలయ్య, పాఠశాల హెచ్‌ఎం వసుధ, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్‌లో స్మారక క్రికెట్ టోర్నీ ప్రారంభం



**అక్షరటుడే, బీర్కూర్ :** మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గ్రౌండ్‌లో ఆపిశెట్టి ప్రదీప్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మాతేజ, ఉపసర్పంచ్ పరమేష్ పంతులు, మాజీ ఎంపీటీసీ సందీప్ పటేల్, యూత్ కాంగ్రెస్ నాయకులు మియాపూరం శశికాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రదీప్ పటేల్‌ను స్మరిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ అరిగే ధర్మతేజ, మాజీ ఎంపీటీసీ సందీప్ పటేల్ బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంలో ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని, ప్రదీప్ పటేల్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ పోటీలు యువతకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బాల్ రాజ్, శివ, భవాని, కుర్రి కృష్ణ, తరుణ్, నాగు, రాకేష్, అంజద్, కోరిమె రఘు, గాండ్ల సంతోష్ కుమార్, ప్రేమ్ పటేల్, మారుతీ పటేల్, ప్రశాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలబాలికల మధ్య సమానత్వం పాటించాలి




**అక్షరటుడే, కోటగిరి:** బాలబాలికల మధ్య సమానత్వం పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో పద్మ అన్నారు. మహిళా, శిశు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ బాలుర పాఠశాలలో లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో మాట్లాడుతూ.. సమాజంలో బాలబాలిక మధ్య ఎలాంటి లింగబేధం చూపించవద్దన్నారు. ట్రైనర్ శిరీష మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న లింగ వివక్షత అంశాలను ఉదాహరణలతో వివరించి, యువ కిశోర బాలురలో లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. మహిళలు, నబాలికలపై వివక్ష, హింసను నివారించడంలో బాలుర పాత్ర ఎంతో ముఖ్యమని ఐసీడీస్ సూపర్‌వైజర్ శ్రీలత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలత, కొమురవ్వ, వెంకటరమణ, షీటీం సభ్యులు ఆశన్న, సునీత, పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాలిక్ పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత



**అక్షరటుడే, లింగంపేట:** మండలం కేంద్రంలోని ఐఓబీ బ్యాంక్ మేనేజర్ నవకాంత్ బాధితురాలికి బుధవారం రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఐలాపురం గ్రామానికి చెందిన పొట్టివారి రామస్వామి అనే వ్యక్తి మూడేళ్ల క్రితం ఐఓబీ ఆధ్వర్యంలో పీఎంఎస్‌బీవై, పీఎంజీజీబీవై ఇన్సూరెన్స్ చేసినట్లు తెలిపారు. పాలసీదారుడు అనారోగ్య కారణలతో ఏడాది క్రితం మృతి చెందడంతో అతని భార్య విజయకు చెక్కును అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మన్నె క్రిష్ణ, ఐవోబీ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ స్వామి పాల్గొన్నారు.

## తండాలో పారిశుధ్య పనులు..



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని టీకారం తండా గ్రామ పంచాయతీలో సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వీధుల్లో ఉన్న మురికి కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో కార్మికుల ద్వారా తొలగింపజేశామన్నారు. విద్యుత్ స్తంభాలు దీపాలను కొత్తవి పెట్టించామన్నారు. గ్రామస్థులు చెత్తను వీధుల్లో వేయకుండా ఒకచోట వేస్తే ట్రాక్టర్ ద్వారా జీపీ కార్మికులు తరలిస్తారని సూచించారు.

## తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

పెద్ద కొడప్‌గల్ తహశీల్దార్‌గా భిక్షపతి..



పెద్ద కొడప్‌గల్ నుంచి బదిలీపై వెళ్తున్న అనిల్‌కు సన్మానం



బీర్కూర్‌లో..



కామారెడ్డి జిల్లాలో పలువురు తహశీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా.. తమకు కేటాయించిన స్థానాల్లో తహశీల్దార్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అలాగే పలుచోట్ల బదిలీపై వెళ్లిన తహశీల్దార్లకు సన్మానం చేశారు.

–అక్షరటుడే, నెట్‌వర్క్

## వివాహానికి ఆర్థిక సాయం అందజేత



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి సామాజిక కార్యకర్త బీఆర్ఎస్ మండల నాయకుడు ఎంఏ హకీమ్ బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త యునుస్ ఖాన్ కొన్నేళ్ల క్రితం మరణించారు. ఆయన కూతురుకు వివాహం నిశ్చయం కాగా.. తనవంతుగా ఆ యువతి పెళ్లికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అఫ్రోజ్ ఖాన్, జుబేర్, అవేజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు యూనిఫాంల అందజేత



**అక్షరటుడే,ముప్కాల్:** ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్కం గంగాధర్, ఉపసర్పంచ్ బర్కం లావణ్య, వార్డు సభ్యుడు అక్కపత్రి ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి విగ్నేష్, హెచ్‌ఎం లక్ష్మణ్, అంగన్వాడీ టీచర్లు శ్యామల, మంజుల, ఆయాలు ముత్తెమ్మ, పూజ, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో దుస్తుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు ఉచిత దుస్తుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముక్కెర విజయ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ స్థాయి నుంచే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి, విద్యాభ్యాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజలింగం, ఉప సర్పంచ్ పద్మ మెహన్, వార్డ్ సభ్యులు ప్రవీణ్, భాస్కర్, రాము, భోజన్న, నరేష్, సునీల్, కారోబార్ సంతు తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్‌నగర్‌లో వైద్య శిబిరం



**అక్షరటుడే, బాల్కొండ:** కిసాన్‌నగర్ గ్రామంలోని నల్ల చంద్రవ్వ నారాయణ రెడ్డి లయన్స్ భవన్‌లో బుధవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఆక్యుప్రెషర్ శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా ఇదే తరహా శిబిరాలు నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు శిబిరంలో రాజస్థాన్‌కు చెందిన వైద్య సిబ్బంది పంకజ్ రాజ్‌పుత్, ధర్మేందర్, సునీల్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, జోనల్ చైర్మన్లు జ్ఞాన సాగర్ రెడ్డి, పిండం జీవన్, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కోశాధికారి వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.